సాక్షి ఆదిలాబాద్

శుక్రవారం ॥ 23 ॥ ఆగస్టు ॥ 2024

కొనసాగుతున్న జూడాల నిరసన



ఆదిలాబాద్‌టౌన్‌: కలకత్తాలోని ఆర్జికార్‌ వైద్య కళా శాలలో వైద్య విద్యార్థినిపై జరిగిన అత్యాచారం, హత్యను నిరసిస్తూ రిమ్స్‌ జూనియర్‌ డాక్టర్లు చేపట్టిన ఆందోళన కార్యక్రమాలు గురువారం నాటికి 9వ రోజుకు చేరుకున్నాయి. డైరెక్టర్‌ చాంబర్‌ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. జూడాల సంఘం అధ్యక్షుడు సందీప్‌చారి మాట్లాడుతూ నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో జూడాలు మౌనిక, కారుణ్య, మల్లికార్జున్‌, మనోజ్‌ పాల్గొన్నారు.

గరిష్ఠం/కనిష్ఠం
32.0/25.0

వాతావరణం
ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. రుతుపవనాల ప్రభావంతో జిల్లాలోని పలు ప్రాంతాల్లో వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్‌

దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌రూరల్‌: ఉమ్మడి ఆదిలాబాద్‌ జిల్లాలోని బీసీ నిరుద్యోగ యువత నుంచి స్కిల్‌ డెవలప్‌మెంట్‌ శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా బీసీ అభివృద్ధి శాఖ అధికారి రాజలింగు, స్టడీ సర్కిల్‌ సెంటర్‌ డైరెక్టర్‌ ప్రవీణ్‌ కుమార్‌ ఒక ప్రకటనలో తెలిపారు. నాన్‌ రెసిడెన్షియల్‌ ఫ్రీ స్కిల్‌ డెవలప్‌మెంట్‌ అండ్‌ ట్రైనింగ్‌ ప్రోగ్రామ్‌ను ఎల్‌జీ హోప్‌ టెక్నికల్‌ స్కిల్‌ అకాడమీ, హైదరాబాద్‌ వారి ద్వారా 100 మంది అభ్యర్థులకు సెప్టెంబర్‌ 1 నుంచి నవంబర్‌ 1 వరకు శిక్షణ, అనంతరం ప్లేస్‌మెంట్‌ ఇవ్వడం జరుగుతుందన్నారు. శిక్షణ కాలంలో నెలకు రూ.4వేల చొప్పున స్టైఫండ్‌ ఇవ్వనున్నట్లు తెలిపారు. 18 నుంచి 25 సంవత్సరాల మధ్య వయస్సు ఉండి ఎస్సెస్సీ, ఇంటర్‌ ఉత్తీర్ణులైన వారు అర్హులన్నారు. ఆసక్తి గల వారు ఈనెల 24లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 08732 221280 నంబరులో సంప్రదించాలన్నారు.

కలెక్టరేట్‌ ఎదుట ధర్నా



ధర్నాలో పాల్గొన్న వ్యకాస నాయకులు

కైలాస్‌నగర్‌: అటవీ, రెవెన్యూ శాఖల ద్వారా జాయింట్‌ సర్వే నిర్వహించి సాగులో ఉన్న పోడు భూములకు హక్కు పత్రాలివ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు లంకా రాఘవులు డిమాండ్‌ చేశారు. గురువారం వ్యకాస, ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్‌ ఎదుట ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అధికారిక లెక్కల ప్రకారం జిల్లాలో 1,54,731 మంది రైతులు 8,70,087 ఎకరాలు సాగు చేస్తున్నారని, ఇందులో చాలా మంది వివరాలు ప్రభుత్వ రికార్డుల్లో నమోదుకాలేదన్నారు. గిరిజన సంక్షేమ, రెవెన్యూ, అటవీ అధికా రులు ఉమ్మడిగా సర్వే నిర్వహించి భూ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్‌ చేశారు. నాయకులు పూసం సచిన్‌, తొడసం భీంరావ్‌, స్వామి, ఉయిక విష్ణు, ఆశన్న, ఆత్రం కిష్టన్న, స్వామి పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్‌ ప్రక్రియ షురూ

కైలాస్‌నగర్‌: అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణ (ఎల్‌ఆర్‌ఎస్‌) దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ జిల్లాలో గురువారం ప్రారంభమైంది. ఇందుకోసం నియమించిన ప్రత్యేకాధికారులకు ఇప్పటికే వారు పరిశీలించాల్సిన దరఖాస్తుదారుల సమాచారంతో కూడిన జాబితాలను ఉన్నతాధికారులు అందజేశారు. వాటి ఆధారంగా రెవెన్యూ, ఇరిగేషన్‌, మున్సిపల్‌ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలోకి వెళ్లి విచారణ చేపడుతున్నారు. దరఖాస్తుదారుల సందేహాలు నివృత్తి చేయడంతో పాటు సలహాలు ఇచ్చేందుకు కలెక్టరేట్‌తో పాటు ఆదిలాబాద్‌ మున్సిపల్‌ కార్యాలయంలో ప్రత్యేక హెల్ప్‌డెస్కులను ఏర్పాటు చేశారు. కలెక్టరేట్‌లో జూనియర్‌ అసిస్టెంట్‌ను, మున్సిపల్‌ కార్యాలయంలో కంప్యూటర్‌ ఆపరేటర్‌ను ఇన్‌చార్జీలుగా నియమించినట్లు పట్టణ ప్రణాళికా అధికారి సుమలత తెలిపారు.

ఉత్సవాలకు రావాలని మంత్రులకు ఆహ్వానం



'భట్టి'కి ఆహ్వానపత్రిక అందిస్తున్న ఎమ్మెల్యే

ఉట్నూర్‌రూరల్‌: ఈనెల 29, 30 తేదీల్లో కుమురంభీం జిల్లా జైనూర్‌ మండలం పాట్నాపూర్‌లో నిర్వహించే సద్గురు పూలాజీ బాబా 100వ జయంతి ఉత్సవాలకు రావాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కకు ఆహ్వాన పత్రిక అందజేశారు. గురువారం ఖానాపూర్‌ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌తో పాటు ఆంద్‌ ఆదివాసీ సంఘ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ దండె విఠల్‌, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్త మల్లేశ్‌ పాల్గొన్నారు.

ఉట్నూర్‌ సబ్‌ కలెక్టర్‌గా యువరాజ్‌ మర్మత్‌

ఉట్నూర్‌రూరల్‌: రాష్ట్ర ప్రభుత్వం ఉట్నూర్‌కు మరో ఐఏఎస్‌ను కేటాయించింది. సబ్‌ కలెక్టర్‌గా యువరాజ్‌ మర్మత్‌ను నియమిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇది వరకు ఐటీడీఏకు పీవోగా ఐఏఎస్‌ అధికారిని కొనసాగిస్తుండగా తాజాగా సబ్‌ కలెక్టర్‌గా ఐఏఎస్‌ స్థాయి అధికారి పోస్టు మంజూరు చేసింది. ఇది వరకు ఈ పోస్టు ఉన్నప్పటికీ కొన్నేళ్లపాటు రద్దు చేసింది. ఐఏఎస్‌ అధికారి రానుండడంతో ఏజెన్సీ ప్రాంతంలో పర్యవేక్షణ మెరుగు పడటంతో పాటు ఆదిమ గిరిజనులకు మరింత సులభంగా పథకాలు అందుతాయని అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఆమెకేదీ రక్షణ..!



- ఆదిలాబాద్‌ పట్టణానికి చెందిన ఓ మహిళా ప్రభుత్వ ఉద్యోగి చిట్టీలు నడిపిస్తోంది. ఓ సమీప బంధువు ఆమె వద్ద చిట్టీ డబ్బులు తీసుకున్నాడు. ఆ డబ్బులు చెల్లించక పోగా, మరికొన్ని డబ్బులు కావాలని తరచూ ఫోన్‌ చేసేవాడు. ఆమె నిరాకరించడంతో ఫోన్‌ నంబర్‌ హ్యాక్‌ చేశాడు. ఆమె మాట్లాడే వ్యక్తులతో చెడు సంబంధాలు ఉన్నాయని బంధువులు, కుటుంబీకులతో చెప్పి నమ్మించాడు. ఆ తర్వాత ఆ వ్యక్తి చేస్తున్న చేష్టలు తెలియడంతో పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సఖీ కేంద్రంలో వారికి కౌన్సెలింగ్‌ ఇచ్చారు.
- ఆదిలాబాద్‌ పట్టణంలోని ఖుర్షీద్‌నగర్‌కు చెందిన ఓ ఆటో డ్రైవర్‌ జిన్నింగ్‌ మిల్లులో పనిచేసేవాడు. మహారాష్ట్రకు చెందిన ఓ మహిళతో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. ఇదివరకే వీరిద్దరికి పెళ్లి అయినప్పటికీ రెండో వివాహం చేసుకున్నారు. కొన్నిరోజుల తర్వాత రెండో భార్యపై అనుమానం పెంచుకొని ఆమెను హత్య చేశాడు. జిల్లా కేంద్రంలోని మార్కెట్‌ సమీపంలో మృతదేహాన్ని పడేశాడు.

- రోజురోజుకు మహిళలపై పెరుగుతున్న దాడులు
- చట్టాలున్నా.. తప్పించుకు తిరుగుతున్న నిందితులు
- ఆగని అఘాయిత్యాలు

ఆదిలాబాద్‌టౌన్‌: యత్రనార్యస్తు పూజ్యంతే రమంతే తత్రతత్ర మధురం మధురం.. ఎక్కడైతే స్త్రీలు గౌరవించబడతారో అక్కడ దేవతలు కొలువై ఉంటారనేది నానుడి.. ఆమె తల్లిగా, చెల్లిగా, భార్యగా, అనుబంధాలను, ఆత్మీయతను పంచుతూ పరిపూర్ణమైన బాధ్యతలను నిర్వర్తిస్తుంది. కానీ రోజురోజుకు ఆడవాళ్లపై అఘాయిత్యాలు పెరిగిపోతున్నాయి. కొంత మంది పురుషులు మృగంలా ప్రవర్తిస్తున్నారు. కామంతో కళ్లు మూసుకొని వెకిలి చేష్టలతో సభ్య సమాజం తలదించుకునే విధంగా చేస్తున్నారు. ప్రతిరోజు ఎక్కడో ఓచోట మహిళలపై దాడులు, అత్యాచారం, హత్యలు జరుగుతున్నట్లు మనం చూస్తున్నాం.. దీంతో మగువలకు ఇంటా, బయట రక్షణ లేకుండా పోతోంది. చిన్న పిల్లల నుంచి మహిళల బతుకులను ఛిద్రం చేస్తున్నారు. జిల్లాలో సైతం మహిళలపై దాడులు, అఘాయిత్యాలు, అత్యాచారం, వేధింపుల కేసులు నమోదవుతున్నాయి.

పెరుగుతున్న దాడులు..

ఆడపిల్లల నుంచి మహిళలపై రోజురోజుకూ దాడులు పెరుగుతూనే ఉన్నాయి. మహిళల రక్షణ కోసం అనేక చట్టాలు ఉన్నప్పటికీ అవి నిందితులకు చుట్టాలుగానే మారుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏదో విధంగా మహిళలను కామాంధులు లోబర్చుకుంటున్నారు. వేధింపులకు పాల్పడడంతో కొంత మంది బయటకు చెప్పుకోలేక ఆత్మహత్యలకు సైతం పాల్పడుతున్న ఘటనలు ఉన్నాయి. మరికొంత మందిని కామాంధులు అంతమొందిస్తున్నారు. జిల్లాలో ఇటీవల కాలంలో ఇలాంటి సంఘటనలు చోటు చేసుకున్నాయి. మహిళలపై వేధింపులకు సంబంధించి ఈయేడాది జిల్లాలో ఇప్పటి వరకు 160 వరకు కేసులు నమోదయ్యాయి. గతేడాది 14 కేసుల్లో, ఈయేడాది ఇప్పటివరకు మూడు కేసులకు సంబంధించి నిందితులకు కోర్టు శిక్షసైతం విధించింది. ఒక కేసులో ఆరుగురికి ఏడేళ్ల జైలు, మరో కేసులో ఒకరికి ఏడాది జైలు, ఇంకో కేసులో ఆరు నెలల జైలు శిక్ష పడింది. గతేడాది ఓ నిందితుడికి 20 ఏళ్ల జైలు, మరో కేసులో ముగ్గురికి పదేళ్ల జైలు, ఇంకో కేసులో ఇద్దరు నిందితులకు రెండేళ్ల జైలు శిక్ష పడింది.

ఇంటా.. బయట వేధింపులే

మహిళలు ఇంటా, బయట అనే తేడా లేకుండా వేధింపులకు గురవుతూనే ఉన్నారు. ఇంట్లో భర్త, అత్తమామలు వేధిస్తుండగా, ఉద్యోగం చేస్తున్న మహిళలు పనిచేసే చోట, విద్యా సంస్థల్లో విద్యార్థినులపై సైతం అఘాయిత్యాలు జరుగుతూనే ఉన్నాయి. నేరడిగొండ మండలంలో ఓ ఉపాధ్యాయుడు విద్యార్థినులపై వేధించగా, ఉట్నూర్‌లో మరో ఉపాధ్యాయుడు ఓ విద్యార్థిని పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన సంఘటనలు జిల్లాలో చోటు చేసుకున్నాయి. కొన్ని సంఘటనలు బయటకు వస్తున్నప్పటికీ అనేక ఘటనలు బయటకు రాకుండా కప్పి పుచ్చుతున్నారు.

వేధిస్తే కఠిన చర్యలు



మహిళలను వేధించే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతోంది. మహిళల రక్షణ కోసం 24 గంటల పాటు షీటీమ్‌ పనిచేస్తుంది. ఏ ఆపదలో ఉన్నా డయల్‌ 100, సఖి కేంద్రానికి సమాచారం ఇవ్వాలి. ఇబ్బందులు ఉన్నవారికి అక్కడ షెల్టర్‌ కూడా కల్పిస్తున్నాం. బాలికలను వేధిస్తే నాన్‌బెయిల్‌ కేసులతో పాటు పోక్సో కేసు నమోదు చేయడం జరుగుతుంది. తల్లిదండ్రులకు తమ పిల్లలకు కౌన్సెలింగ్‌ ఇవ్వాలి.

– ఎల్‌.జీవన్‌ రెడ్డి, డీఎస్పీ, ఆదిలాబాద్‌

2023లో సఖీ కేంద్రంలో నమోదైన కేసులు	
గృహహింస కేసులు	168
అత్యాచారం కేసులు	01
అత్యాచార వేధింపులు	01
బాలికలపై లైంగిక వేధింపులు (పోక్సో)	24
కిడ్నాప్‌ కేసులు	22
ప్రేమ వివాహాలు, ప్రేమ పేరిట కేసులు	23
వరకట్న వేధింపులు	02
మహిళలపై ఇతర కేసులు	18
498ఏ ఐపీసీ	1
ప్రాపర్టీ కేసులు	4
మొత్తం	264

2024లో నమోదైన కేసులు	
గృహహింస కేసులు	123
అత్యాచారం కేసులు	03
మహిళల అక్రమ రవాణా	03
చిన్నారులపై లైంగిక వేధింపులు (పోక్సో)	18
బాల్య వివాహాలు	01
మిస్సింగ్‌, కిడ్నాప్‌ కేసులు	20
సైబర్‌క్రైమ్‌, ప్రేమ సంబంధిత కేసులు	08
వరకట్న వేధింపుల కేసులు	03
ఇతర కేసులు	15
ప్రాపర్టీ కేసులు	2
మొత్తం (ఇప్పటివరకు)	196

శునకాలకు కు.ని. శస్త్రచికిత్సలు

- కలెక్టర్‌ ఆదేశాలతో కదిలిన బల్దియా యంత్రాంగం
- యానిమల్‌ కేర్‌ సెంటర్‌లో నేటి నుంచి ప్రారంభం
- సంతానోత్పత్తిని తగ్గించే దిశగా చర్యలు
- అమలుపైనే అనుమానాలు

కైలాస్‌నగర్‌: పట్టణంలో కుక్కల బెడద రోజురోజుకూ పెరుగుతోంది. వీధుల్లో గుంపులు గుంపులుగా స్వైరవిహారం చేస్తూ ప్రజలపై దాడులకు పాల్పడుతున్నాయి. ముఖ్యంగా మహిళలు, చిన్నారులు ఒంటరిగా తిరుగలేని పరిస్థితులు ఏర్పడుతున్నాయి. దీనిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదులు వెల్లువెత్తిన నేపథ్యంలో వాటి కట్టడికి చర్యలు చేపట్టాలని బల్దియా యంత్రాంగాన్ని ఆదేశించారు. దీంతో ఎట్టకేలకూ ఆదిలాబాద్‌ బల్దియా యంత్రాంగం శునకాల కట్టడిపై దృష్టి సారించింది. వాటి సంతాన ఉత్పత్తిని నియంత్రించేలా సర్జరీలు చేసేందుకు సిద్ధమైంది. పశు వైద్యుల ఆధ్వర్యంలో సాగనున్న శస్త్రచికిత్సలకు బల్దియా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది.

ఇదీ పరిస్థితి...

పట్టణంలో వీధి కుక్కల నియంత్రణ బాధ్యత మున్సిపల్‌పైనే ఆధారపడి ఉంటుంది. వీటి సంఖ్య పెరగకుండా ఉండేందుకు సంతానోత్పత్తిని నియంత్రించేలా ఏటా వాటికి సర్జరీలు చేయించాల్సి ఉంటుంది. కానీ బల్దియా పరిధిలో కొన్నేళ్లుగా సర్జరీలు చేయడం లేదు. దీంతో కుక్కల సంతానోత్పత్తి గణనీయంగా పెరుగుతోంది. ఒక్కో శునకం ఏడాదిలో రెండు సార్లు పిల్లలకు జన్మనిస్తోంది. ఒక కాన్పులో 4 నుంచి 10 పిల్లల వరకు కంటుంది. మూడు, నాలుగేళ్ల నుంచి సర్జరీలు లేకపోవడంతో వాటి సంఖ్య గణనీయంగా పెరిగిపోయింది. ఏడాదికి సుమారు వెయ్యి నుంచి 1500 శునకాల సంఖ్య పెరిగే అవకాశముంటుందని పశు సంవర్ధకశాఖ అధికారులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం ఆదిలాబాద్‌ బల్దియా పరిధిలో 4 నుంచి 5 వేల వీధి కుక్కలు ఉన్నట్లుగా అధికారులు చెబుతున్నారు.



సర్జరీల తర్వాత కుక్కలను ఉంచేందుకు నిర్మించిన కేజీలు

ఎట్టకేలకు కు.ని శస్త్రచికిత్సలు ..

కుక్కలకు శస్త్రచికిత్సలు చేసేందుకోసం బల్దియా ఆధ్వర్యంలో ఆదిలాబాద్‌ పట్టణ పరిధిలోని బంగారుగూడ డంపింగ్‌యార్డులో రూ.50లక్షల వ్యయంతో ప్రత్యేకంగా యానిమల్‌ కేర్‌ సెంటర్‌ను నిర్మించారు. సర్జరీల అనంతరం ఐదు రోజుల పాటు వాటిని అక్కడే ఉంచేందుకు ప్రత్యేకంగా 65 కేజ్‌లు (ప్రత్యేక గదులను) సైతం నిర్మించారు. అయితే ఇప్పటి వరకు సర్జరీలు మాత్రం చేపట్టలేదు. దీంతో ఈ సెంటర్‌ రెండేళ్లుగా అలంకారప్రాయంగా మారింది. ఇటీవల బల్దియా కార్యాలయంలో నిర్వహించిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమానికి హాజరైన కలెక్టర్‌ రాజర్షిషా కుక్కల బెడదతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను ప్రస్తావించారు. కుక్కల కట్టడికి చర్యలు చేపట్టాలని బల్దియా యంత్రాంగాన్ని ఆదేశించారు. కలెక్టర్‌ ఆదేశాలతో కదిలిన బల్దియా అధికారులు వీధి కుక్కల సంతాన ఉత్పత్తిని అరికట్టేలా, వాటికి సర్జరీలు చేసేందుకు సిద్ధమయ్యారు. పశు సంవర్ధకశాఖ పరిధిలోని నలుగురు వైద్యులను ఇందుకోసం ప్రత్యేకంగా నియమించారు. వైద్యులు దూద్‌రాం రాథోడ్‌, సురేష్‌, గజానన్‌, సుదేష్‌ ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి శునకాలకు సర్జరీలు చేయనున్నారు. ఈ ప్రక్రియను కలెక్టర్‌ ప్రారంభించనున్నారు. సర్జరీల అనంతరం వాటిని ఐదు రోజుల పాటు పర్యవేక్షించేందుకోసం కేజీల్లో ఉంచనున్నారు. గతంలో ఓ సారి సర్జరీలు నిర్వహించేందుకు అంతా సిద్ధం చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. ఈ సారైనా కు.ని సర్జరీలను పకడ్బందీగా చేపడుతారా? లేక మళ్లీ మొక్కుబడిగానే వదిలేస్తారా? అనేదీ త్వరలోనే తేలనుంది.

సహకారశాఖలో భారీగా బదిలీలు

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

కై లాస్‌నగర్‌: జిల్లా సహకారశాఖలో భారీగా బదిలీలు జరిగాయి. దీర్ఘకాలంగా ఒకే చోట పనిచేస్తున్న పలువురు అసిస్టెంట్‌ రిజిస్ట్రార్‌, సీనియర్‌, జూనియర్‌ ఇన్‌స్పెక్టర్లతో పాటు జూనియర్‌ అసిస్టెంట్లకు స్థానచలనం కలిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

ఉద్యోగి పేరు	హోదా	ప్రస్తుతం పనిచేస్తున్నది	బదిలీ ప్రాంతం
రాథోడ్‌ బిక్కు	డిప్యూటీ రిజిస్ట్రార్‌	ఆదిలాబాద్‌	ఆసిఫాబాద్‌ డీసీఓ
అరుణ	అసిస్టెంట్‌ రిజిస్ట్రార్‌	బోథ్‌	ఆదిలాబాద్‌ ఫీల్డ్‌-2
శారద	అసిస్టెంట్‌ రిజిస్ట్రార్‌	ఉట్నూర్‌	ఆదిలాబాద్‌
అనిత	అసిస్టెంట్‌ రిజిస్ట్రార్‌	ఆదిలాబాద్‌ ఫీల్డ్‌-1	జీసీసీ ఆడిటర్‌
నవీనకళ	అసిస్టెంట్‌ రిజిస్ట్రార్‌	ఆదిలాబాద్‌	ఆదిలాబాద్‌ ఫీల్డ్‌-1
భూమన్న	సీనియర్‌ ఇన్‌స్పెక్టర్‌	ఆదిలాబాద్‌ ఫీల్డ్‌-2	నిర్మల్‌
పి.సంతోష్‌	సీనియర్‌ ఇన్‌స్పెక్టర్‌	ఆదిలాబాద్‌ ఫీల్డ్‌-3	ఆదిలాబాద్‌ ఫీల్డ్‌-1
జలాలొద్దీన్‌	సీనియర్‌ ఇన్‌స్పెక్టర్‌	ఉట్నూర్‌	బోథ్‌
ఆర్తి	సీనియర్‌ ఇన్‌స్పెక్టర్‌	బోథ్‌	ఆదిలాబాద్‌
లక్ష్మీప్రసన్న	సీనియర్‌ ఇన్‌స్పెక్టర్‌	హైదరాబాద్‌	ఆదిలాబాద్‌ ఫీల్డ్‌-3
సునీత	జూనియర్‌ ఇన్‌స్పెక్టర్‌	ఆదిలాబాద్‌ ఫీల్డ్‌-1	బోథ్‌
అబ్దుల్‌ షకీల్‌	జూనియర్‌ ఇన్‌స్పెక్టర్‌	ఉట్నూర్‌	నిర్మల్‌
జి.నర్సయ్య	డిప్యూటీ రిజిస్ట్రార్‌	నిర్మల్‌	ఆదిలాబాద్‌
దేవుబాయి	జూనియర్‌ అసిస్టెంట్‌	ఉట్నూర్‌	ఆదిలాబాద్‌
శశికళ	జూనియర్‌ అసిస్టెంట్‌	ఆదిలాబాద్‌	ఉట్నూర్‌

నిబంధనలు పాటించని ఆస్పత్రులపై చర్యలు

- కలెక్టర్‌ రాజర్షిషా

ఆదిలాబాద్‌టౌన్‌: నిబంధనలు పాటించని ప్రైవేట్‌ ఆస్పత్రులపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్‌ రాజర్షిషా అన్నారు. గురువారం పట్టణంలోని గజానన్‌ ప్రైవేట్‌ ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగుల ద్వారా వివరాలు అడిగి తెలుసుకున్నారు. చికిత్సకు సంబంధించిన ధరల పట్టిక ఎందుకు పెట్టలేదని, కార్డియాలజిస్ట్‌ లేకపోయినప్పటికీ సంబంధిత వైద్యుడి బోర్డును ఎందుకు పెట్టారని ప్రశ్నించారు. పలు లోపాలు ఉండడంతో ఆస్పత్రి యాజమాన్యానికి నోటీసు జారీ చేయాలని వైద్యారోగ్య శాఖ అధికారిని ఆదేశించారు. జ్వరాలు, డెంగీ కేసుల వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. డెంగీ నిర్ధారణ పరీక్ష (ఎలీసా) రిమ్స్‌లో మాత్రమే ఉందని, ప్రైవేట్‌ వైద్యులు డెంగీ పేరిట రోగులను ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు. కలెక్టర్‌ వెంట డీఎంహెచ్‌వో కె.కృష్ణ, డీఐఓ నరేందర్‌ రాథోడ్‌, సిబ్బంది ఉన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ఆదిలాబాద్‌టౌన్‌: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని కలెక్టర్‌ రాజర్షిషా అన్నారు. గురువారం పట్టణంలోని బాలాజీనగర్‌లో పర్యటించారు. కాలనీలో డెంగీ కేసు నమోదు కావడంతో కాలనీను సందర్శించి పలు సూచనలు చేశారు. కాలనీలో అపరిశుభ్రంగా ఉండడంతో మున్సిపల్‌ వార్డు ఇన్‌చార్జిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. షోకాజు నోటీసు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్‌ వెంట డీఎంహెచ్‌ఓ కృష్ణ, వైద్యాధికారులు నరేందర్‌ రాథోడ్‌, శ్రీధర్‌, అంకోలి మెడికల్‌ ఆఫీసర్‌ సర్ఫరాజ్‌ తదితరులు ఉన్నారు.

ఆదిలాబాద్‌రూరల్‌: వర్షాలు కురుస్తున్నందున విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా నిర్వాహకులు చూసుకోవాలని కలెక్టర్‌ రాజర్షి షా అన్నారు. గురువారం ఆదిలాబాద్‌ రూరల్‌ మండలంలోని అనుకుంటలో గల మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు.



రోగుల కే షీట్లను పరిశీలిస్తున్న కలెక్టర్‌

ప్రతీ విద్యార్థి బడికి హాజరయ్యేలా చూడాలి

కైలాస్‌నగర్‌: ప్రభుత్వ బడుల్లోని ప్రతీ విద్యార్థి విధిగా పాఠశాలకు హాజరయ్యేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్‌ రాజర్షి షా అన్నారు. జిల్లాలోని ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు, కాంప్లెక్స్‌ హెచ్‌ఎంలతో గురువారం కలెక్టరేట్‌ సమావేశ మందిరంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ విద్యార్థుల హాజరుశాతం పెంచేందుకు ప్రతీ 3వ శనివారం తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించి అభ్యసన సామర్థ్యాలు, విద్యార్థుల ఆరోగ్యం, గైర్హాజరు కాకుండా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించాలన్నారు. పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు ప్రణాళికబద్ధంగా ముందుకు సాగాలన్నారు. సమావేశంలో ట్రెయినీ కలెక్టర్‌ అభిజ్ఞాన్‌ మాల్వీయా, డీఈవో ప్రణీత, తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ రుణమాఫీ చేసేంత వరకు పోరాటం

- బీఆర్‌ఎస్‌ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న
- ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌజ్‌ ఎదుట రైతు ధర్నా



ఆదిలాబాద్‌టౌన్‌ : ధర్నాలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న


ఆదిలాబాద్‌టౌన్‌: కాంగ్రెస్‌ ప్రభుత్వం రైతులకు సంపూర్ణ రుణమాఫీ చేసేంత వరకు అన్నదాతల పక్షాన ఉండి పోరాడుతామని మాజీమంత్రి, బీఆర్‌ఎస్‌ పార్టీ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. బీఆర్‌ఎస్‌ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కేటీఆర్‌ పిలుపు మేరకు గురువారం జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌజ్‌ ఎదుట రైతు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో దేవుళ్లపై ప్రమాణం చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌ రెడ్డి అధికారంలోకి వచ్చాక రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. రాష్ట్రస్థాయి బ్యాంకర్లతో జరిగిన సమావేశంలో రూ.41వేల కోట్ల రుణమాఫీ అవసరమని నిర్ణయించారని, క్యాబినెట్‌ సమావేశంలో రూ.31వేల బడ్జెట్‌ పెట్టారని, తీరా రూ.26వేల కోట్లు అయ్యిందని ఎద్దేవా చేశారు. రుణమాఫీ విషయంలో రైతులు అయోమయంలో ఉన్నారన్నారు. కేవలం 40 శాతం మంది రైతులకు మాత్రమే రుణమాఫీ జరిగిందన్నారు. మాఫీ కాని రైతులు బ్యాంకులు, వ్యవసాయ శాఖ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చేంత వరకు బీఆర్‌ఎస్‌ పార్టీ తరపున పోరాటాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్‌ కమిటీ మాజీ చైర్మన్‌లు యాసం నర్సింగరావు, నాయకులు మెట్టు ప్రహ్లాద్‌, రోకండ్ల రమేశ్‌, విజ్జగిరి నారాయణ, యూనుస్‌ అక్బాని, సతీష్‌ పవార్‌, గంభీర్‌ ఠాక్రే, ప్రకాష్‌, గణేశ్‌, పొచ్చన్న, రైతులు పాల్గొన్నారు.

సీఎం రాజీనామా చేయాలి

నేరడిగొండ: ఆరు గ్యారెంటీల అమలు చేతకాకపోతే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాజీనామా చేయాలని ఎమ్మెల్యే అనిల్‌ జాదవ్‌ అన్నారు. ఇచ్చోడలో చేపట్టిన ధర్నాకు వెళ్లే ముందు మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి ఆంక్షలు లేకుండా రైతులందరికీ రూ.2లక్షల రుణమాఫీ వర్తింపజేయాలని డిమాండ్‌ చేశారు. కేసీఆర్‌ పాలనలో 24 గంటల పాటు కరెంటు, రైతుబంధుతో రైతులు సంతోషంగా ఉన్నారని గుర్తుచేశారు. కాంగ్రెస్‌ పార్టీ అధికారంలోకి రావడం కోసం రేవంత్‌ రెడ్డి రెచ్చిపోయి మాట్లాడుతుంటే కాంగ్రెస్‌ పార్టీకి హీరో వచ్చాడని ఆ పార్టీ నాయకులు అనుకున్నారని, సీఎం అయ్యాక ఆయన మాటలు చూస్తే ఆయన హీరో కాదు.. విలన్‌ అని ఆ పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులే చెబుతున్నారని పేర్కొన్నారు. అనంతరం ఇచ్చోడ ధర్నా కార్యక్రమానికి కార్యకర్తలతో కలిసి బయల్దేరి వెళ్లారు.

రైతులను మోసగించిన ప్రభుత్వం

- బోథ్‌ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్‌



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్‌జాదవ్‌

ఇచ్చోడ: రెండు లక్షల రుణమాఫీ పేరుతో కాంగ్రెస్‌ ప్రభుత్వం రైతులను మోసంచేసి సిగ్గులేకుండా ప్రవర్తిస్తోందని బోథ్‌ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్‌ ఆరోపించారు. గురువారం మండల కేంద్రంలోని అంబేద్కర్‌ చౌరస్తాలో రైతులు, బీఆర్‌ఎస్‌ శ్రేణులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ప్రతీ రైతుకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ ప్రభుత్వం లేనిపోని కొర్రీలు విధిస్తోందన్నారు. అర్హులందరికీ రుణమాఫీ అయ్యేంత వరకు ప్రభుత్వాన్ని వదిలిపెట్టేది లేదన్నారు. నిజం కాలం నుంచే ప్రశ్నించే తత్వం ఉన్న ఇక్కడి ప్రాంత రైతులకు ఉద్యమాలు కొత్తకావన్నారు. కార్యక్రమంలో ఇచ్చోడ, బోథ్‌, నేరడిగొండ మండలాల మాజీ ఎంపీపీలు ప్రీతంరెడ్డి, తుల శ్రీనివాస్‌, రాథోడ్‌ సజన్‌లాల్‌, బోథ్‌, భీంపూర్‌ మాజీ జెడ్పీటీసీలు సంధ్యారాణి, సుధాకర్‌, ఇచ్చోడ మండల కన్వీనర్‌ కృష్ణారెడ్డి, నాయకులు గాడ్గే సుభాష్‌, తిరుమల్‌గౌడ్‌, పాండురంగ్‌ పాల్గొన్నారు.

క్లుప్తంగా

బోథ్ పీఏసీఎస్‌లో డీసీవో విచారణ

సాక్షి ఎఫెక్ట్

బోథ్: బోథ్ ప్రాథమిక సహకార సంఘంలో అధికారుల తప్పిదంతో రైతు సిందె శివాజీకి రుణమాఫీ కాలేదు. 'అధికారుల నిర్లక్ష్యం..రుణమాఫీకి దూరం 'శీర్షికన గురువారం సాక్షిలో కథనం ప్రచురితమైంది. దీనికి జిల్లా సహకార సంఘం అధికారి మోహన్ స్పందించారు. పీఏసీ ఎస్‌లో రుణాలకు సంబంధించిన రికార్డులు, రుణమాఫీ రికార్డులను పరిశీలించారు. వివరాలు తెలుసుకుని చర్యలు చేపడుతామన్నారు.

ఉపాధ్యాయుడికి షోకాజు నోటీసు

ఆదిలాబాద్‌టౌన్: నేరడిగొండ మండలంలోని శంకరాపూర్ ఎంపీపీఎస్ పాఠశాల ఉపాధ్యాయుడికి డీఈవో ప్రణీత గురువారం షోకాజు నోటీసు జారీ చేశారు. ఉపాధ్యాయుడు హేమాజీ..పాఠశాలకు సక్రమంగా రావడం లేదని, విద్యాబోధన చేయడం లేదని గ్రామస్తులు ఈనెల 8న కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో విచారణ చేపట్టాలని డీఈవో, ఎంఈవో, స్కూల్ కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్‌ను ఆదేశించారు. విచారణ అనంతరం డీఈవో ఆయనకు షోకాజు నోటీసు జారీ చేశారు. ఆయన వివరణ అనంతరం శాఖపరమైన చర్యలు చేపట్టనున్నారు.

ఇద్దరు ఉపాధ్యాయులకు చార్జిమెమో

ఆదిలాబాద్‌టౌన్: ఇటీవల జరిగిన బదిలీల్లో స్పౌజ్ కేటగిరిని దుర్వినియోగం చేసిన ఇద్దరు ఉపాధ్యాయులకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డీఈవో ప్రణీత చార్జిమెమోలు జారీ చేశారు. ఆదిలాబాద్‌రూరల్ మండలంలో పనిచేసిన టీచర్ ఇటీవల గుడిహత్నూర్ మండలానికి బదిలీ అయ్యారు. స్పౌజ్ కేటగిరికి సంబంధించి దుర్వినియోగం చేశారని తెలిపారు. ఆదేవిధంగా కజ్జర్ల ఎంపీపీఎస్ పాఠశాలలో పనిచేస్తున్న మరో టీచర్‌కు చార్జిమెమో జారీ చేశారు. తమపై ఎందుకు చర్యలు తీసుకోవద్దని వివరణ కోరారు. గతేడాది జరిగిన బదిలీల్లో ముగ్గురు టీచర్లు స్పౌజ్ కేటగిరిని దుర్వినియోగం చేయడంతో వారికి ఇంక్రిమెంట్లో కోత విధించారు. వీరిపై చర్యలు చేపట్టే అవకాశం ఉన్నట్లు సమాచారం.

సైబర్ నేరగాళ్ల మోసం

ఆదిలాబాద్‌టౌన్: సైబర్ నేరగాళ్ల వలలో పడి ఓ వ్యక్తి రూ.49 వేలు పోగొట్టుకున్నట్లు టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. పట్టణంలోని తాంసి బస్టాండ్ ప్రాంతానికి చెందిన అన్వేష్ ఈనెల 15న వాట్సాప్‌లో ఇన్వెస్ట్ మనీ అంటూ మెస్సేజ్ వచ్చింది. ప్రైవేట్ కంపెనీలో పెట్టుబడి పెడితే డబ్బులు రెట్టింపు అవుతాయని గుర్తుతెలియని వ్యక్తులు చెప్పడంతో రూ.10వేలు, ఆ తర్వాత రూ.7వేలు, మరోసారి రూ.9వేలు, ఇంకోసారి రూ.12వేలు, రూ.6వేలు, మరో మారు రూ.5 వేలు చెల్లించాడు. తీరా డబ్బులు తిరిగిరాకపోవడంతో మోసపోయినట్లు గ్రహించాడు. గురువారం బాధితుడి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

దుబాయ్‌లో అనారోగ్యంతో ఒకరి మృతి

భైంసారూరల్: ఉపాధి కోసం దుబాయ్ వెళ్లిన కోతల్‌గాం వాసి అనారోగ్యంతో మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని కోతల్‌గాం గ్రామానికి చెందిన సట్ల నర్సయ్య(50) గతంలో వ్యవసాయ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. అప్పుల పాలు కావడంతో ఉపాధి కోసం గతేడాది దుబాయ్ వెళ్లాడు. అక్కడే పని చేస్తున్నాడు. కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన బుధవారం మృతిచెందాడు. రాష్ట్రప్రభుత్వం మృతదేహాన్ని స్వదేశానికి రప్పించేలా చర్యలు తీసుకోవాలని కుటుంబీకులు కోరుతున్నారు. మృతుడి భార్య సుగుణ, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

తండాలకు తీజ్ శోభ

తెలంగాణ పండుగల్లో బతుకమ్మ, బోనాలు ప్రత్యేకమైనవి. ప్రకృతిని పూజించి పువ్వులు, గడ్డితో జరుపుకునే సంప్రదాయ చరిత్రకు ఆనవాళ్లు ఇవి. ఈ రెండింటిలోనూ మహిళలకే ఎక్కువ ప్రాధాన్యం కనిపిస్తుంది. గిరిజన లంబాడా యువతులు జరుపుకునే తీజ్(గడ్డి బతుకమ్మ) పండుగ సైతం ఈ కోవలోకే వస్తుంది. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలోని వివిధ మండలాల్లో తీజ్ ఉత్సవం ప్రారంభమైంది. పెళ్లికాని యువతులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు.

- గిరి గ్రామాల్లో సందడి
- పెళ్లి కాని యువతులకు ప్రత్యేకం
- ఉమ్మడి జిల్లాలో ప్రారంభమైన వేడుకలు



కెరమెరి: గోధుమ బుట్టల్లో నీళ్లు చల్లుతున్న యువతులు



కెరమెరి: గోధుమలకు నీరు చల్లడానికి వస్తున్న యువతులు

కెరమెరి/లింగాపూర్: గిరిజన తండాల్లో పెళ్లికాని యువతులు ప్రత్యేకంగా జరుపుకొనే పండుగ తీజ్. లంబాడాలు తమ సంస్కృతిని, సంప్రదాయాలను కాపాడుతూ నియమ నిష్టలతో 9 రోజులు ఈ వేడుకలు నిర్వహిస్తారు. ఆటాపాటలు, వినోదాలు, వినూత్న ఆచారాలతో ఈ పండుగ బతుకమ్మ తరహాలో ఉంటుంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఇప్పటికే ఈ వేడుకలు ప్రారంభమయ్యాయి. శ్రావణమాసంలో రాఖీపౌర్ణమి రోజు ప్రారంభమైన తీజ్ ఉత్సవం శ్రీ కృష్ణాష్టమికి ముగుస్తుంది.

తీజ్‌లో నిమగ్నం

రాఖీ పౌర్ణమి నుంచి లంబాడా గిరిజనులంతా 'తీజ్'పండుగ జరుపుకోవడంలో నిమగ్నమై ఉన్నారు. ఓ వైపు పెళ్లికాని యువతులు ఆడిపాడుతూ కుల దేవతలను కొలుస్తూ ఎర్రమట్టిలో గోధుమలు చల్లుతారు. ఆ బుట్టలనే తీజ్ అంటారు. దీన్ని 'తీజ్ భరాయిరో'పిలుస్తారు. ఆరోజు నుంచి నియమనిష్టలు పాటిస్తారు. గ్రామానికి మంచి జరగాలని, మంచి భర్త రావాలని కోరుతూ ఉపవాస దీక్ష ప్రారంభించారు. మూడు పూటలు బావుల వద్దకు వెళ్తారు. అక్కడి నుంచి తెచ్చిన నీళ్లను 'తీజ్'లపై చల్లుతున్నారు. ఆరు రోజుల పాటు ఇదే ప్రక్రియ కొనసాగుతుంది.

ఏడో రోజు 'ధమోళీ'సందడి

ప్రతీ ఇంట్లో బియ్యపు పిండితో రొట్టెలు చేసి బెల్లం నెయ్యితో కలుపుతారు. దీన్నే చేర్మా అని అంటారు. ఈ చేర్మా ఉన్న తీజ్ బుట్టలను ఇంటి ఆవరణలో నెలకొల్పిన కులదేవుడు 'సేవాభయ్య'కు శాఖాహారి నైవేద్యంగా సమర్పిస్తున్నారు. అదేరోజు ఇంటి సింహద్వారానికి ఎదురుగా జొన్నలతో నింపిన గోనె సంచులు.. వాటి ముందు నీళ్ల కడవ ఉంచి దానిలో వేప మండలు పేర్చుతారు. కడవ ముందు జొన్న పిండితో ముగ్గులు వేస్తారు. వాటి మధ్య వెండితో తయారు చేసిన 'మేరామ యాడి'తల్లి విగ్రహాన్ని ఉంచి దీపం వెలిగించి పూజ చేస్తారు. ఆమె మాంసాహారి అయినందున మేకపోతు బలి ఇస్తారు. ఆ రాత్రి యువతులు ఇంటింటికీ చేర్మాని సేకరిస్తారు. ఏడో రోజు వరుసైన వారికి పూస్తూ నృత్యాలు చేయడంతో ధమోళీ సందడి మొదలవుతుంది.

ఎనిమిదో రోజు 'గణగోర్'వివాహం

ఎనిమిదో రోజు చెరువు వద్దకు వెళ్లి మట్టిని తీసుకుస్తారు. రెండు, ఆడ, మగ బొమ్మలు తయారు చేస్తారు. ఆడ బొమ్మకు గాంగ్రి, మగ బొమ్మకు ధోవతి, లాల్చీతో వేషధారణ చేస్తారు. ఆ బొమ్మలను మేళాతాళాలతో తీజ్‌లు ఉన్న చోటకు ఊరేగింపుగా తీసుకెళ్తారు. అక్కడ ఆ బొమ్మలకు వివాహం ఘనంగా జరిపిస్తారు. అక్కడే లాప్సీ(పాయసం) తయారు చేసి ఉత్సవ ప్రతిమలకు నైవేద్యంగా సమర్పిస్తారు. 'గణ'అంటే వారి కులదేవత. 'మేరామ యాడి'అని 'గోర్'అంటే కుల దేవుడు సేవాభయ్యా అని గిరిజనులు పిలుస్తుంటారు. వారిరువురికి ఈ రోజు పెళ్లి చేసినట్లు చెప్పుకుంటారు.

తొమ్మిదో రోజు..

ఆఖరి తొమ్మిదో రోజును 'తీజ్ తోడేరో దాడో'అని పిలుస్తారు. ఆ రోజు యువతులు ఇంటింటికి వెళ్లి తీజ్‌లు తెంపడానికి రావాలని అందరినీ ఆహ్వానిస్తారు. వారు వచ్చాకే మంచె పైనున్న తీజ్ బుట్టలను కిందికి దించుతారు. కులదేవతలను పూజిస్తూ 'తీజ్'నారును తెంపుతారు. దాన్ని వరుసగా కూర్చున్న మగవారి తలపాగాలో పెడతారు. ఆడవారైతే కొంగుకు, ఇంకొందరు ఇంటి గుమ్మానికి కడుతారు. అనంతరం జొన్నరొట్టెలు చేసి డప్పు వాయిద్యాలతో తీజ్ నిమజ్జనానికి బయల్దేరి చెరువులు లేదా బావుల వద్దకు వెళ్లి నిమజ్జనం చేస్తారు. దీన్నే 'తీజ్ ఎరాయోరో'అంటారు. ఇది ఒక లంబాడా బతుకమ్మగా భావిస్తారు. గోర్ బంజారాలు నిర్వహించే ఈ పండుగలో వారి సంస్కృతి ఉట్టిపడుతుంది. పంచకట్టు, ఖమీజ్ రుపాట్ ధరించి పురుషులు, టుక్రి, కాంచ్లీ, చేతులకు బలియాలు వేసుకుని యువతులు, సంస్కృతికి తగ్గట్టుగానే తయారువుతారు. గడ్డి బతుకమ్మను తెచ్చి ఆడపడుచులు సోదరుల కాళ్లు కడుగుతారు. ఆపై పారే నీటిలో గడ్డి బతుకమ్మలను వదులుతారు.

తీజ్ ఎంతో ఇష్టం



తీజ్ పండుగంటే ఎంతో ఇష్టం. బుట్టల్లో గోధుమలకు 9 రోజులు నీళ్లు పోస్తూ చివరి రోజు ఉత్సవం జరుపుకుంటాం. ఇలా జరుపుకోవడంతో అన్ని కార్యాలు సిద్ధిస్తాయని పెద్దలు చెబుతారు. పాడి పంటలు, ఇంటిల్లిపాది, గ్రామంలోని ప్రజలు సుఖశాంతులతో ఉంటారు.
– జె.దివ్యరాణి, చందుగూడ, కెరమెరి

నిధులు మంజూరు చేయాలి



గిరిజనులు సంస్కృతి సంప్రదాయబద్ధంగా తీజ్ జరుపుకుంటారు. వర్షాలు సమృద్ధిగా కురిసి, పంటలు బాగా పండాలని వేడుకుంటాం. తీజ్ ఉత్సవాలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలి.
– జాధవ్ గణపత్, మాజీ ఎంపీపీ, లింగాపూర్

ఆలయానికి వెళ్లి నీటిని తెచ్చి..



పెళ్లికాని యువతులు 9 రోజులు డప్పుచప్పుళ్లతో ఉదయం, సాయంత్రం జగదాంబదేవి ఆలయానికి వెళ్తారు. అక్కడ మంచి నీరును తీసుకువచ్చి నాయక్ ఇంటికి వస్తారు. తీజ్ బుట్టల్లో నీరు చల్లుతారు.
– రాథోడ్ కిరణ్ నాయక్, లింగాపూర్

నియమ నిష్టతో ఉంటాం



తీజ్ ఉత్సవాన్ని 9 రోజులు నియమ నిష్టతో జాగరణలో ఉండి పూజలు చేస్తాం. ఉత్సవాలు ముగిసేవరకు ఒక పూట భోజనం చేస్తాం. చివరి రోజు ఉపవాస దీక్షతో ఉంటాం. భక్తిశ్రద్ధలతో ఉత్సవాలు నిర్వహిస్తాం.
– జాదవ్ మౌనికాబాయి, లింగాపూర్

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత



పూజలు చేస్తున్న ఎంపీ గోడం నగేశ్

తలమడుగు: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్ అన్నారు. మండలంలోని అర్లి (కే) గ్రామంలో సద్గురు శబరిమాత ఆలయంలో అఖండ జ్యోతి మహోత్సవంలో గురువారం ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. బీజేపీ నాయకులు చంద్రకాంత్, స్వామి, ప్రభాకర్, కిరణ్, వెంకటస్వామి, కిష్టు, పురుషోత్తం, భుజంగరావు ఉన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

ఆదిలాబాద్‌టౌన్: నిబంధనలు అతిక్రమించే ప్రైవేట్ ల్యాబ్‌లపై కఠిన చర్యలు ఉంటాయని డీఎంహెచ్‌వో కె.కృష్ణ అన్నారు. గురువారం ప్రైవేట్ ల్యాబ్ టెక్నీషియన్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లినిక్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ 2010 ప్రకారం ఆస్పత్రి, డయాగ్నోస్టిక్ కేంద్రాలు, క్లినిక్‌లు ఖచ్చితంగా డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో నమోదు చేసుకోవాలన్నారు. అనుమతి లేకుండా నిర్వహిస్తే సీజ్ చేస్తామని హెచ్చరించారు. రిమ్స్‌లో మాత్రమే డెంగీ నిర్ధారణ పరీక్షలు చేయడం జరుగుతుందని, ప్రైవేట్ ల్యాబ్‌లలో చేయవద్దన్నారు. మలేరియా నివారణ అధికారి శ్రీధర్, స్టాటిస్టికల్ అధికారి బ్రహ్మానందరెడ్డి, డీపీఎం అనిల్ పాల్గొన్నారు.

ఆస్పత్రిలో తల్లి,శిశువు మృతిపై విచారణ

భైంసాటౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఏరియాస్పత్రిలో కాన్పు కోసం వచ్చిన గర్భిణితోపాటు మగ శిశువు బుధవారం మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై విచారణకు కలెక్టర్ ఆర్డీవోను ఆదేశించారు. ఆర్డీవో కోమల్ రెడ్డి, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ గురువారం ఆస్పత్రికి చేరుకుని గర్భిణి శీతల్‌రాథోడ్, నవజాత మగశిశువు మృతికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఆస్పత్రిలో వైద్యుల హాజరు, రోగులకు అందుతున్న సేవలపై తనిఖీ చేశారు. సీజనల్ వ్యాధుల నేపథ్యంలో అందుబాటులో ఉండి వైద్యం అందించాలన్నారు.

బస్టాండ్‌లో ఊడిన పెచ్చులు



కిందపడిన పెచ్చులు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీలత

- ప్రయాణికులకు గాయాలు

భైంసాటౌన్: భైంసా ఆర్టీసీ బస్టాండ్‌లో గురువారం భవనం పెచ్చులూడి పడడంతో ముగ్గురు ప్రయాణికులు గాయపడ్డారు. కుభీర్ స్టేజీ వద్ద బస్సు కోసం ప్రయాణికులు వేచి ఉండగా ఒక్కసారిగా పెచ్చులు ఊడిపడ్డాయి. దీంతో శ్రీలత తల, చేయికి గాయాలు కాగా, సంగీతతోపాటు ఓ చిన్నారికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు వారిని ప్రభుత్వ ఏరియాస్పత్రికి తరలించి చికిత్స అందజేశారు. డీఎం హరిప్రసాద్, అసిస్టెంట్ మేనేజర్ శ్రీలత ఆస్పత్రికి చేరుకుని బాధితులను పరామర్శించారు.

కుమారుడి పెళ్లిరోజే తండ్రి ఆత్మహత్య

- అనారోగ్యంతో పురుగుల మందు తాగి అఘాయిత్యం



లింగన్న మృతదేహం

నిర్మల్‌రూరల్: కుమారుడి పెళ్లి రోజే తండ్రి అనారోగ్యంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మండలంలో ఈ ఘటన విషాదం నింపింది. రూరల్ ఎస్సై సాయికుమార్ కథనం ప్రకారం..మండలంలోని నీలాయపేట గ్రామానికి చెందిన లింగన్న(53) కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. గురువారం తన కుమారుడు రాకేశ్ పెళ్లి ఉండడంతో ఉదయం పశువులకు మేతకని వెళ్లాడు. అక్కడే పురుగుల మందు తాగాడు. లింగన్న ఆచూకీ కోసం వెతికినా దొరకలేదు. కుటుంబ సభ్యులు కుమారుడి పెళ్లి అనంతరం సాయంత్రం పొలానికి వెళ్లి చూడగా విగతజీవిగా పడి ఉన్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్సై వివరించారు.

24న అండర్-19 టేబుల్ టెన్నిస్ ఎంపిక పోటీలు

మంచిర్యాలఅర్బన్: జైపూర్ తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల (బాలుర)లో జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఈనెల 24న అండర్-19 బాల, బాలికల ఉమ్మడి జిల్లాస్థాయి టెబుల్ టెన్నిస్ ఎంపిక పోటీలు ఉంటాయని ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి బాబురావు తెలిపారు. 2006 జనవరి 1 తర్వాత జన్మించి ఆరో తరగతి ఆపై ఇంటర్ చదువుతున్న విద్యార్థులు ఈ పోటీలకు అర్హులని పేర్కొన్నారు. క్రీడాకారులు తమ కాలేజీ బోనాఫైడ్, ఆధార్ జిరాక్స్ తీసుకుని పోటీల కన్వీనర్ నాగేశ్వర్‌రావు, టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ పాఠశాల పీడీ సంతోష్ కుమార్‌ను సంప్రదించాలని సూచించారు. ఈనెల 23 సాయంత్రం 4గంటల లోపు తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

అండర్-14, 17 జిల్లా స్థాయిలో..

జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఈనెల 24న టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ జైపూర్‌లో అండర్-14, 17 జిల్లాస్థాయి టేబుల్ టెన్నిస్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ఫణిరాజా తెలిపారు. అండర్-14 విభాగంలో పాల్గొనే వారు జనవరి 1, 2011 తర్వాత జన్మించి ఆరో తరగతి ఆపై తరగతులు చదివినవారు అర్హులని పేర్కొన్నారు. అండర్-17 విభాగంలో పాల్గొనే వారు జనవరి 1, 2008 తర్వాత జన్మించి ఆరో తరగతి, ఆపై తరగతులు చదివినవారై ఉండాలన్నారు. వివరాలకు ప్రిన్సిపాల్ నాగేశ్వర్‌రావు సంప్రదించాలని సూచించారు.

హాకీకి పూర్వ వైభవం తీసుకురావాలి

ఆదిలాబాద్: జాతీయ క్రీడ హాకీకి పూర్వ వైభవం తీసుకురావాలని హాకీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలోని మేజర్ ధ్యాన్‌చంద్ హాకీ ఫీల్డ్‌లో క్రీడాకారులకు గురువారం స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా అందజేసిన క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒలింపిక్‌లో వరుసగా రెండోసారి హాకీలో కాంస్య పతకాన్ని గెలవడం గొప్ప విషయమన్నారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పార్థసారథి, శిక్షకుడు శ్రీనివాస్ ఉన్నారు.

గల్ఫ్‌కార్మికుడికి ఉపశమనం

- ఒకే పేరుపై రెండు పాస్‌పోర్టులు ఉండడంతో సమస్య
- ప్రవాసీమిత్ర లేబర్ యూనియన్ చొరవతో పరిష్కారం



సౌదీలో చిక్కుకున్న స్వామి



హైదరాబాద్ పాస్‌పోర్ట్ కార్యాలయం వద్ద మస్కాపూర్ వాసితో స్వదేశ్ పరికిపండ్ల

ఖానాపూర్: ఉపాధి కోసం రెండేళ్ల క్రితం సౌదీకి వెళ్లిన నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలోని మస్కాపూర్ గ్రామానికి చెందిన ఇనవేని స్వామి పాస్‌పోర్ట్ సమస్య కారణంగా అక్కడే చిక్కుకుని నానా ఇక్కట్లు పడుతున్నాడు. సౌదీలో అతను పనిచేసే కంపెనీ యజమాని వేధింపులు భరించలేక ఆరునెలలకే బయటకు వెళ్లి కల్లివెల్లిలో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో తిరిగి స్వదేశానికి రావడానికి ప్రయత్నించగా అతని పాస్‌పోర్ట్ ముందుగా పనిచేసిన యజమాని వద్దే ఉండిపోయింది. కాగా, జూలైలో సౌదీలోని రియాద్ కాన్సులేట్ కార్యాలయానికి వెళ్లి గోడు వెళ్లబోసుకోగా వారు ఔట్ పాస్‌పోర్ట్ వర్తింపజేయడానికి తగిన రుసుము కట్టించుకున్నారు. అయినప్పటికీ నెలలు గడిచినా సమస్య పరిష్కారం కాలేదు. దీంతో కాన్సులేట్‌కు వెళ్లగా అనుమానితుల కేటగిరీలో పేరు ఉండడంతో ఇండియాలోని హైదరాబాద్ రీజినల్ పాస్‌పోర్ట్ కార్యాలయానికి విచారణ కోసం పంపామని అక్కడి అధికారులు తెలిపారు. కాగా, ఈ విషయమై బాధితుడు కాంగ్రెస్ ఖానాపూర్ మండలాధ్యక్షుడు దయానంద్ దృష్టికి తీసుకెళ్లగా, అతను ప్రవాసీమిత్ర లేబర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు స్వదేశ్ పరికిపండ్లకు తెలిపాడు. దీంతో ప్రవాసీమిత్ర బృందం హైదరాబాద్ కార్యాలయానికి వెళ్లి ఆరాతీశారు. మస్కాపూర్ గ్రామంలో ఇదే పేరుపై మరో వ్యక్తికి పాస్‌పోర్టు ఉండడంతో పాటు వారి తల్లి దండ్రుల పేర్లు, పుట్టిన తేదీలు ఒకేలా ఉన్నాయి. వారిరువురు దగ్గరి బంధువులు కావడంతో ఫేస్ కూడా ఒకేలా ఉంది. ఇద్దరూ గతంలో దుబాయ్ వెళ్లి వచ్చిన వారు కావడంతో కాన్సులేట్ కార్యాలయాల్లో వివరాలు నమోదయ్యాయి. దీంతో మస్కాపూర్ గ్రామానికి చెందిన మరో వ్యక్తి స్వామిని వారు హైదరాబాద్ కార్యాలయానికి తీసుకెళ్లి పూర్తి వివరాలు అందించి సమస్య పరిష్కారానికి కృషిచేశారు. కాగా, స్వామిని సౌదీ నుంచి త్వరలోనే ఇండియాకు తీసుకురావడానికి ఉన్న అడ్డంకులు తొలగిపోయాయని స్వదేశ్ పరికిపండ్ల తెలిపారు.

'అధిక సాంద్రతలో పత్తిసాగు'పై క్షేత్ర సందర్శన



పత్తి సాగును పరిశీలిస్తున్న రైతులు, శాస్త్రవేత్తలు

కైలాస్‌నగర్: పట్టణంలోని రాంనగర్‌లోని కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో కేంద్రీయ పత్తి పరిశోధన సంస్థ నాగ్‌పూర్ సహకారంతో 'అధిక సాంద్రతలో పత్తి సాగు'పై క్షేత్ర సందర్శనలు నిర్వహిస్తున్నారు. గురువారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని యాపల్‌గూడ గ్రామ రైతులు సాగు చేస్తున్న పత్తి పంటలను పరిశీలించారు. పత్తి పరిశోధన సంస్థ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డా.సునీల్ మహాజన్ ఆధ్వర్యంలో వారికి శిక్షణనిచ్చారు. పంట సాగు విధానం, ఎరువులు, చీడపీడల యాజమాన్యంపై అవగాహన కల్పించారు. అధిక సాంద్రత పద్ధతిలో సాగు చేస్తున్న పత్తిలో ప్రస్తుతం పంట 50 సెం.మీ.ల ఎత్తులో ఉందని, దీనికి మోపిక్వాట్ క్లోరైడ్ 1 మి.లీటర్‌లో కలిపి పిచికారి చేయాలన్నారు. 60–75 సెంమీ ఎత్తులో మరోసారి పిచికారి చేయాలని సూచించారు. కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా.వై ప్రవీణ్ కుమార్, కేవీకే శాస్త్రవేత్త డా.కె.రాజశేఖర్, టెక్నికల్ ఆఫీసర్లు రాంటెక్, అజిత్ తదితరులు ఉన్నారు.

శుభకార్యానికి వెళ్లి తిరిగి వస్తుండగా..

- నవీపేట శివారులో కల్వర్టును ఢీకొన్న బైక్
- తండ్రి మృతి, కుమారుడికి గాయాలు



సాయన్న మృతదేహం

బాసర: శుభకార్యానికి వెళ్లి తిరిగి వస్తుండగా కల్వర్టును బైక్ ఢీకొని తండ్రి మృతిచెందగా, కుమారుడికి గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని కిర్గుల్ (కే) గ్రామానికి చెందిన సగు సాయన్న (60), కుమారుడు సుభాష్ బైక్‌పై గురువారం నిజామాబాద్ జిల్లా నవీపేట్ మండలం గుంజిలి గ్రామంలో బంధువుల గృహప్రవేశానికి వెళ్లారు. తిరిగి వస్తుండగా నవీపేట శివారులో కల్వర్టును ఢీకొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు వారిని ఆసుపత్రికి తరలించగా సాయన్న మార్గమధ్యలో మృతి చెందాడు. నిజామాబాద్ జిల్లా ఏరియా ఆస్పత్రిలో సుభాష్ చికిత్స పొందుతున్నాడు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

- బైక్‌ను ఢీకొన్న వాహనం
- మేడిపల్లి శివారులో ఘటన





గాయపడిన రామారావు, ధనుష్

నిర్మల్‌రూరల్: మండలంలోని మేడిపల్లి శివారులో జాతీయ రహదారిపై గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు..మామడ మండలం కిషన్‌రావుపేట్ గ్రామానికి చెందిన రామారావు(19), సునీల్(19), ధనుష్(17)లు కలిసి ఒకే బైక్‌పై నిర్మల్‌కు వచ్చారు. పని అనంతరం రాత్రి తిరుగుపయనమయ్యారు. మార్గమధ్యలో గుర్తు తెలియని వాహనం బైక్‌ను ఢీకొట్టింది. ముగ్గురు ఎగిరి రోడ్డుపై పడడంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు అందించిన సమాచారంతో 108 సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రులను జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఇందులో రామారావు, సునీల్ పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.


పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని పాత హౌజింగ్ బోర్డుకు చెందిన కుంట ప్రభాకర్‌రెడ్డి(37) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వన్‌టౌన్ ఎస్సై పద్మ కథనం ప్రకారం.. పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఆయన రోజులాగే బుధవారం ఉదయం ఇంటి నుంచి బయల్దేరి వెళ్లాడు. రాత్రి వరకు తిరిగి రాలేదు. భార్య స్వాతి పాఠశాలలో తెలుసుకోగా రాలేదని తెలిసింది. చుట్టుపక్కలా ఆయన ఆచూకీ ప్రయత్నించినా దొరకలేదు. ఆమె ఫిర్యాదుతో వన్‌టౌన్ పోలీసులు గురువారం మిస్సింగ్ కేసు నమోదు చేశారు. మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో పట్టణంలోని ఏరోడ్రాంలో శవమై తేలాడు. పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అప్పుల బాధతో ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు కుటుంబీకులు పేర్కొన్నారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరేసుకుని ఒకరు..

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని మహాలక్ష్మివాడకు చెందిన మాదస్తు రమేశ్ (52) ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు టూటౌన్ ఏఎస్సై ముకుంద్‌రావు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. గత మూడేళ్లుగా ఒంటరిగా జీవనం సాగిస్తున్నాడు. అనారోగ్యం బారిన పడడంతో జీవితంపై విరక్తితో బుధవారం రాత్రి ఇంట్లో ఉరేసుకున్నాడు. మృతుడి తమ్ముడు లక్ష్మణ్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

రైలు కిందపడి యువకుడి..



వెంకటేశ్ (ఫైల్)

తలమడుగు: జీవితంపై విరక్తితో యువకుడు రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కోసాయి రైల్వేస్టేషన్ సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని రుయ్యాడి గ్రామానికి చెందిన మావురపు వెంకటేశ్ (31) కొన్నినెలలుగా మద్యానికి బానిసయ్యాడు. ఈక్రమంలో జీవితంపై విరక్తితో గురువారం రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు. మృతుడికి భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు.

క్లుప్తంగా

ఎమ్మార్పీఎస్ కార్యవర్గం ఎన్నిక

నేరడిగొండ: ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, వీహెచ్‌పీఎస్ మండల నూతన కార్యవర్గాన్ని గురువారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు గోనే అడెల్లు ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గజ్జల అశోక్, కోశాధికారిగా నవీన్, గోనే ఊశన్నలను ఎన్నుకున్నారు.

నిందితులను శిక్షించాలని మానవహారం



మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు

ఇంద్రవెల్లి: కోల్‌కత్తాలోని వైద్యురాలిపై జరిగిన అత్యాచార ఘటనకు నిరసనగా గురువారం మండలంలోని ముత్నూర్ గ్రామంలోని లిటిల్ స్టార్ ప్రైవేటు స్కూల్ విద్యార్థులు ప్రధాన రహదారిపై శాంతి ర్యాలీ నిర్వహించి కుమురం భీం విగ్రహం వద్ద మానవహారం నిర్వహించారు. నిందితులను శిక్షించాలని డిమాండ్ చేశారు. హత్యకు గురైన విద్యార్థిని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

దారికి మరమ్మతులు

బోథ్: మండలంలోని సొనాల గ్రామంలో గల ప్రధాన రహదారికి అధికారులు మరమ్మతులు ప్రారంభించారు. ఇటీవల కురిసిన వర్షాలకు దారి మొత్తం చిత్తడిగా మారగా గ్రామస్తులు దారిపై నడవలేని పరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్రమంలో నూతన రోడ్డు నిర్మించాలని ప్రజలు కోరగా, ప్రజలు ఇబ్బందులు పడకుండా తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

బోథ్: సీజనల్ వ్యాధులపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు నవీన్ రెడ్డి తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు, మలేరియా టెస్టులు నిర్వహించారు. అనంతరం మందులు అందించారు. వైస్ ప్రిన్సిపాల్ రవికుమార్, సూపర్‌వైజర్ కవిత, ఏఎన్‌ఎం సవిత, హెల్త్ అసిస్టెంట్ గోవర్ధన్, ప్రేమ పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

బోథ్: విద్యార్థులకు నాణ్యమైన, పౌష్టికాహారంతో కూడిన భోజనాన్ని అందించాలని మండల ప్రత్యేకాధికారి, డీఎస్‌వో కిరణ్ కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ బాలికల గురుకుల పాఠశాలను సందర్శించారు. అనంతరం విద్యార్థుల భోజనం అమలు తీరును పరిశీలించారు. సరుకులను పరిశీలించి, సూచనలు చేశారు. విద్యార్థులు, సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. ఎంపీడీవో జీవన్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ రవి కుమార్, ఏపీవో జగ్దే రావు పాల్గొన్నారు.

పరామర్శ

నేరడిగొండ: మండలంలోని వడూర్ గ్రామానికి చెందిన మాడెపు చిన్నభూమారెడ్డి ఇటీవల అనారోగ్యానికి గురై మృతిచెందారు. విషయాన్ని తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర లెక్చరర్ల సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ గురువారం వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తులు శంకర్, గంగారెడ్డి, ధర్మదాస్ మహేందర్ ఉన్నారు.

బోథ్: మండల కేంద్రానికి చెందిన ఎంపీడీవో సుశీల్ రెడ్డి తండ్రి వినాయక్ రెడ్డి ఇటీవల మృతి చెందగా బలరాం జాదవ్ పరామర్శించారు.

బజార్‌హత్నూర్: వర్తమన్నూర్ గ్రామానికి చెందిన రాజేశ్వర్ రెడ్డి గుండె సంబంధిత చికిత్స చేయించుకుకోగా ఎంపీ గోడం నగేశ్ పరామర్శించారు. గణేశ్, శ్రీనివాస్, భోజన్న, నర్సయ్య, రాజు, గంగారాం, రాజేందర్, మహేందర్ పాల్గొన్నారు.

'మానసికంగా వేధింపులకు గురి చేస్తున్నారు'

ఆదిలాబాద్‌రూరల్: జిల్లాలో విధులు నిర్వహిస్తున్న మాదిగ జాతి ఉద్యోగులను మనువాద మతతత్వ పార్టీలు, కొన్ని సంఘాల నాయకులు మానసిక వేధింపులకు గురి చేస్తున్నారని తెలంగాణ మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు మల్యాల మనోజ్ మాదిగ పేర్కొన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మాదిగ జాతి ఉద్యోగస్తులను బ్లాక్ మెయిల్ చేయడం మానుకోవాలని, లేనిపక్షంలో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. జిల్లా ఉపాధ్యక్షుడు కత్తి గంగాధర్ మాదిగ, జిల్లా కార్యదర్శి ముక్కెర మాదిగ, జిల్లా సహాయ కార్యదర్శి కొల్లూరు స్వామి మాదిగ, నాయకులు భూమన్న మాదిగ, నాందేవ్ తదితరులు ఉన్నారు.

అలంకారప్రాయంగా క్రీడా ప్రాంగణాలు

- గ్రామాలకు దూరంగా నిర్మించిన వైనం
- నిరుపయోగంగా ప్రజాధనం



ఉప్రీలో ఏర్పాటు చేసిన తెలంగాణ గ్రామీణ క్రీడా ప్రాంగణం

తలమడుగు: గ్రామీణ ప్రాంతాలలో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు అలంకార ప్రాయంగా మారాయి. లక్షల రూపాయలు నిధులు వెచ్చించి నిర్మించిన క్రీడామైదానాలు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. గ్రామీణ యువత క్రీడల్లో రాణించేందుకు గత ప్రభుత్వం ఒక్కో గ్రామపంచాయతీకి ఒక క్రీడా ప్రాంగణాన్ని ఏర్పాటు చేసింది. అందుకు అవసరమైన నిధులను జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా సమకూర్చింది. కానీ ఈ మైదానాల వల్ల ఎవరికి లబ్ధి చేకూరని పరిస్థితి నెలకొంది. కొన్ని గ్రామపంచాయతీలలో కేవలం బోర్డు ఏర్పాటు చేసి మమ అనిపించారు. మరికొన్ని గ్రామాల్లోని క్రీడామైదానాలలో ఒక్కరోజు కూడా ఆటలు ఆడిన దాఖలాలు లేవు. ఒక్కొక్క క్రీడా ప్రాంగణానికి రూ.50,000లతో నియోజవర్గంలోని 9 మండలాలో గల అన్ని గ్రామపంచాయతీల్లో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశారు. ఆయా గ్రామాల్లో 20 గుంటల స్థలంలో క్రీడా ప్రాంగణాలు నిర్మించారు. కొన్ని గ్రామాల్లో స్థలం లేని కారణంగా 10 గుంటల స్థలంలో ఏర్పాటు చేశారు. కొన్ని గ్రామాలలో గత సర్పంచ్‌లు స్థలాన్ని చదును చేసే క్రమంలో గ్రామ పంచాయతీ నిధులతో క్రీడా ప్రాంగణానికి అధిక మొత్తంలో నిధులు ఖర్చు చేశారు. వీటితో వ్యాయామానికి రెండు పోల్స్, రెండు వాలీబాల్ పోల్స్ వేయాల్సి ఉండగా, వ్యాయామానికి సంబంధించిన పోల్స్ తప్ప వాలీబాల్‌కు సంబంధించిన చిన్న పోల్స్ ఎక్కడా కనిపించడం లేదు.

దూరభారం..

బోథ్ నియోజకవర్గంలోని గ్రామ పంచాయతీల్లో నిర్మించిన క్రీడా ప్రాంగణాల్లో చాలా వరకు గ్రామాలకు దూరంగా నిర్మించారు. దీంతో అనేక గ్రామాలలో క్రీడా ప్రాంగణాలు ఎక్కడున్నాయో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. మండలంలోని 28 గ్రామపంచాయతీలలో గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో క్రీడా ప్రాంగణాలు నిర్మించారు. మండలంలోని కప్పరిదేవి, కుచులపూర్, పలిస తదితర గ్రామాలలో దూరంగా ఏర్పాటు చేయడంతో నిరుపయోగంగా ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి క్రీడాప్రాంగణాలను వినియోగంలోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

గ్రామాలకు దగ్గరగా ఉండాలి



క్రీడా ప్రాంగణాలు కొన్ని గ్రామాలలో దూరంగా ఏర్పాటు చేయడం వల్ల ప్రయోజనం లేకుండా పోయింది. క్రీడాస్థలం ఉంటే ఉదయం, సాయంత్రం వ్యాయామాలు చేసేందుకు, క్రీడలు ఆడేందుకు ఉపయోగంగా ఉంటుంది. తక్కువ స్థలంలోనైనా క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయాలి.

– వెల్మ నారాయణరెడ్డి

వినియోగంలోకి తీసుకొస్తాం

గ్రామాలలో ప్రభుత్వ స్థలం లభించని పరిస్థితిలో సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు సూచించిన స్థలంలో క్రీడాప్రాంగణాలు ఏర్పాటు చేశాం. ప్రస్తుతం మైదానాల చుట్టూ మొక్కలు పెంచి, పచ్చదనంతో వాటిని ఆధునీకరించి వినియోగంలోకి తీసుకొస్తాం. పిల్లలు ఆడుకునేలా చర్యలు తీసుకుంటాం.

– చంద్రశేఖర్, ఎంపీడీవో

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకోవాలి



మొక్కలు నాటుతున్న జెడ్పీసీఈవో జితేందర్‌రెడ్డి

ఇచ్చోడ: ప్రతీ ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటి పర్యవరణాన్ని కాపాడుకోవాలని జెడ్పీసీఈవో జితేందర్ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని గాంధీనగర్ ప్రాథమిక పాఠశాలలో ఏక్ పేడ్ మాకా నామ్ పే కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటి గ్రామస్తులతో మాట్లాడారు. పర్యావరణాన్ని కాపాడుకునే బాధ్యత ప్రతి ఒక్కరూ తీసుకోవాలన్నారు. మొక్కలు నాటే కార్యక్రమంలో యువత, మహిళా సంఘాలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరారు. అనంతరం ఇచ్చోడ ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించి సిబ్బందితో మాట్లాడారు. ఎంపీడీవో లక్ష్మణ్, సిబ్బంది సీఈవోను ఘనంగా సత్కరించారు.

నేరడిగొండ: చెట్లతోనే మానవ మనుగడ సాధ్యమని జిల్లా పరిషత్ సీఈవో జితేందర్ రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటి నీరు పోశారు. ఎంపీడీవో రాజ్‌వీర్, ఎంపీవో లక్ష్మణ్, పంచాయతీ కార్యదర్శి సర్సారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తలమడుగు: గ్రామాలలో వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా నాటిన ప్రతీ మొక్కను సంరక్షించాలని ఎంపీడీవో చంద్రశేఖర్ అన్నారు. గురువారం మండలంలోని ఖోడద్, తలమడుగు, బరంపూర్, కజ్జర్ల, కుచులపూర్, దేవపూర్, ఉమ్రీ, కోసాయి, డోర్లి గ్రామాలలో మొక్కలు నాటారు. 'నాటుదాం ఒక చెట్టు అమ్మ పేరున' అనే కార్యక్రమంలో ప్రతీ ఒక్కరు భాగస్వాములై మొక్కలు నాటాలన్నారు. తహసీల్దార్ రాజ్‌మోహన్, గ్రామ పంచాయతీ కార్యదర్శులు శివకుమార్, వినోద్, విజయ్, ఉపాధ్యాయులు కృష్ణకుమారి, సుకుమార్, రామ్‌రెడ్డి, రాజేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాంసి: ప్రతీ ఒక్కరు పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి, భీంపూర్ మండల ప్రత్యేకాధికారి కిషన్ కోరారు. గురువారం భీంపూర్ మండలంలోని మార్కగూడ గ్రామంలో నాటుదాం ఒక చెట్టు అమ్మ పేరు మీద కార్యక్రమంలో భాగంగా గ్రామ శివారులో మొక్కలు నాటారు. ఎంపీడీవో గోపాలకృష్ణ రెడ్డి, ఏపీవో సంగీత, ఈసీ నరేందర్, పంచాయతీ కార్యదర్శి సునీత సిబ్బంది ఉన్నారు.

పొన్నారిలో మొక్కలు నాటిన ఎంపీడీవో..

తాంసి మండలంలోని పొన్నారి గ్రామంలో నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమంలో ఎంపీడీవో మోహన్ రెడ్డి పాల్గొన్నారు. ఏపీవో విజయ, ఈసీ గంగయ్య, మాజీ సర్పంచ్ అశోక్, మాజీ ఎంపీటీసీ రఘు, రమణ తదితరులు పాల్గొన్నారు.

గన్‌పార్క్ ధర్నాలో కంది శ్రీనివాస్‌రెడ్డి



ధర్నాలో పాల్గొన్న కంది శ్రీనివాస్‌రెడ్డి

కైలాస్‌నగర్: అదానీ గ్రూప్‌పై జేపీసీ వేయాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా ఈడీ కార్యాలయాల ఎదుట ధర్నాలకు ఏఐసీసీ పిలుపునివ్వగా సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ రాష్ట్ర శ్రేణులు హైదరాబాద్‌లోని గన్‌పార్క్ వద్ద ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

'ఏమాయికుంటను ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దాలి'



ఏమాయికుంటలో మార్నింగ్‌వాక్ నిర్వహిస్తున్న డీఆర్‌డీవో సాయన్న

ఇంద్రవెల్లి: ఏమాయికుంట గ్రామపంచాయతీని ఆదర్శ గ్రామపంచాయతీగా తీర్చిదిద్దడానికి కృషి చేయాలని డీఆర్‌డీవో సాయన్న అన్నారు. గురువారం ఉదయం మండలంలోని ఏమాయికుంట గ్రామంలో మార్నింగ్ వాక్ నిర్వహించారు. జాతీయ స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ 2024 అవార్డుకు ఏమాయికుంట గ్రామపంచాయతీ ఎంపికైనందున గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. గ్రామంలో పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రతీ శుక్రవారం డ్రైడే నిర్వహించాలన్నారు. ఎంపీడీవో భాస్కర్, ఏపీవో జాదవ్ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ జాదవ్ లఖన్, గ్రామస్తులు ఉన్నారు.

'సాయినగర్ సమస్యలు పరిష్కరించండి'

బోథ్: మండల కేంద్రంలోని సాయినగర్ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని మండల కేంద్రానికి చెందిన సామాజిక కార్యకర్త జక్కుల వెంకటేశ్ గురువారం మండల కేంద్రానికి వచ్చిన డీఆర్డీవో పీడీ సాయన్నకు విన్నవించారు. రోడ్లు, మురికి కాలువలు లేక సాయి నగర్ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మండల కేంద్రంలో ప్రతీ మంగళవారం నిర్వహించే వారసంతలో మూత్రశాలలు నిర్మించాలని కోరారు.

సంక్షిప్త వార్తలు

వైభవంగా రాతి ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన

బేల: మండలంలోని కొత్త సాంగిడి గ్రామంలో హనుమన్ ఆలయం ప్రాంగణంలో గురువారం నూతన రాతి ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని స్థానికుల ఆధ్వర్యంలో వైభవంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధ్వజ స్తంభానికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ఉట్నూర్‌రూరల్: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను గురువారం పట్టుకున్నట్లు ఎఫ్ఆర్‌వో శిలానంద్ తెలిపారు. ఉట్నూర్ అటవీ ప్రాంతం నుంచి ఇసుక తరలిస్తున్నారన్న సమాచారం మేరకు కొమ్ముగూడ సమీపంలో తనిఖీలు చేసి ట్రాక్టర్లను పట్టుకొని ఉట్నూర్ రేంజ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. ఆయన వెంట ఏఎస్‌వో గోపాల్ ఉన్నారు.

ధర్నాలో పాల్గొన్న నాయకులు

ఎదులాపురం: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ పార్టీ హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద గురువారం చేపట్టిన ధర్నాలో జిల్లాకు చెందిన నాయకులు పాల్గొన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జగన్ సింగ్, సురేశ్, అశోక్, వసంతరావు, రాము, బుచ్చిరాం, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

తెలంగాణ కళారత్న అవార్డుకు ఎంపిక

ఆదిలాబాద్: జిల్లాకు చెందిన నృత్య శిక్షకుడు, బాల కేంద్రం సూపరింటెండెంట్ మిట్టు రవి తెలంగాణ కళారత్న అవార్డుకు ఎంపికయ్యాడు. తెలంగాణ రాష్ట్ర భాష సంస్కృతిక శాఖ, కళా రవళి సోషియో కల్చరల్ అసోసియేషన్ -హుజురాబాద్, ఆధ్వర్యంలో అవార్డును ప్రదానం చేయనున్నారు. ఈనెల 25వ తేదీన కరీంనగర్‌లోని కేశవపట్నంలో అవార్డు అందుకోనున్నట్లు రవి తెలిపారు.

లారీల్లోని డీజిల్, బ్యాటరీలు చోరీ

బోథ్: మండల కేంద్రంలోని సాయి నగర్ కాలనీ వద్ద ఓ వెంచర్‌లో ఉన్న పలు లారీలకు సంబంధించిన బ్యాటరీలు, డీజిల్‌ను చోరీ చేశారు. సాయినగర్ వద్ద గల వెంచర్‌లో గత కొంత కాలంగా లారీలు నిలుపుతున్నారు. బుధవారం రాత్రి సమయంలో మూడు లారీలకు సంబంధించిన ఆరు బ్యాటరీలు, రెండు లారీల్లోని డీజిల్‌ను దొంగిలించారు. దీంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ప్రిన్సిపాల్‌ను కలిసిన అధ్యాపకులు

ఉట్నూర్‌రూరల్: ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని సైన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంగీతను గురువారం ఉట్నూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రతాప్‌సింగ్, అధ్యాపకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రిన్సిపాల్ సంగీతను శాలువాతో సన్మానించారు. వైస్‌ప్రిన్సిపాల్ సాయి ప్రసాద్, అధ్యాపకులు నర్సింగ్‌రావు, స్వామి, రవీందర్, రవి, కిరణ్‌లు ఉన్నారు.

కోట్నాక్ భీంరావు వర్ధంతి పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: మాజీ మంత్రి, మొదటి గిరిజన మంత్రి కోట్నాక్ భీంరావు వర్ధంతి పోస్టర్లను ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా గురువారం ఐటీడీఏ కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో మంత్రి కుమారుడు కోట్నాక్ రమేశ్, రాజ్‌గోండ్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు పెందూర్ ప్రభాకర్, రాయిసెంటర్ జిల్లా మేడి మెస్రం దుర్గు, కొద్దు, నిరంజన్, ప్రకాశ్, బాలాజీ, భీమన్న, కాశీంరావు, ఆశారెడ్డి, ఓమేశ్ తదితరులు పాల్గొన్నారు.


'ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలి'

బేల: మావల మహాత్మా జ్యోతిబాపూలే (జైనథ్) గురుకులం విద్యార్థులను వేధిస్తున్న ప్రిన్సిపాల్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని ఏబీవీపీ జిల్లా హాస్టల్ కన్వీనర్ మాడవార్ హరీశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం మండలకేంద్రంలోని ఏబీవీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రిన్సిపాల్ అకారణంగా విద్యార్థులకు టీసీలు ఇస్తామని మానసిక వేధనకు గురిచేస్తున్నారన్నారు. ఏబీవీపీ నాయకులు ఓం ప్రకాశ్, మనోజ్‌రెడ్డి, రాపెల్లి కృష్ణ, అనోజ్‌రెడ్డి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కలెక్టర్ రాక

సిరికొండ: కలెక్టర్ రాజర్షిషా శుక్రవారం ఉదయం 11 గంటలకు మండలంలోని రిమ్మ గ్రామ పంచాయతీ పరిధి తిమ్మపూర్ గ్రామంలో పర్యటించనున్నట్లు ఐకేపీ ఏపీఎం సంతోష్‌కుమార్ తెలిపారు. పీఎంఎఫ్ఎంఈ కింద మంజూరైన ఆయిల్ మిల్, ఫ్లోర్‌మిల్‌ను కలెక్టర్ ప్రారంభించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఎంపీ గెలుపుతో పాదరక్షలు వేసుకున్న కార్యకర్త



దుస్తులు అందజేస్తున్న ఎంపీ నగేశ్

బోథ్: గోడం నగేశ్ ఎంపీగా గెలిచేంత వరకు పాదరక్షలు వేసుకోనని, గత ఐదేళ్లుగా పాదరక్షలు లేకుండా నడుస్తున్న కార్యకర్త విజయ్‌కుమార్‌కు ఎంపీ నగేశ్ గురువారం ఆదిలాబాద్‌లోని తన ఇంటిలో పాదరక్షలు అందజేసి వేయించారు. అనంతరం కొత్త దుస్తులు అందించి శాలువాతో సత్కరించారు. బీజేపీ మండల కన్వీనర్ బోరె రవీందర్, పీఏసీఎస్ చైర్మెన్ కదం ప్రశాంత్, రాజేశ్వర్, జుగాది రావు, షేక్, నారాయణ, శ్రీనివాస్, విష్ణు, చంద్రకాంత్ తదితరులు ఉన్నారు.

ఘనంగా అంతరిక్ష దినోత్సవం



అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయుడు కైలాస్

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో ఫిజిక్స్, కెమిస్ట్రీ విభాగాల ఆధ్వర్యంలో గురువారం అంతరిక్ష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పెయింటింగ్, క్విజ్ పోటీలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ సంగీత మాట్లాడుతూ భారతదేశం శాస్త్ర, సాంకేతిక రంగంలో ముందుకు దూసుకెళ్తుందన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జగ్‌రాం, లెక్చరర్లు అరుణ్‌కుమార్, రమాకాంత్‌గౌడ్, మంజుల, శ్రావణి, జ్యోత్స్న, రవికిరణ్ పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: అంతరిక్ష దినోత్సవం సందర్భంగా మండలంలోని గౌరపూర్ ప్రాథమిక పాఠశాలలో గురువారం ఆదిత్య ఎల్1 రాకెట్ నమూన ప్రదర్శనతో పాటు ఇస్రో ప్రయాణంపై ఎగ్జిబిషన్ నిర్వహించారు. పాఠశాలకు చెందిన సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయుడు తోడసం కైలాస్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు అశోక్, దశరథ్, సురాజ్, కైలేశ్వరి, రాజ్‌మోహన్ తదితరులు ఉన్నారు.

బోథ్: మండలంలోని సొనాల గ్రామంలోని వివేకానంద పాఠశాలలో గురువారం అంతరిక్ష దినోత్సవం నిర్వహించారు. అంతరిక్ష విషయాలపై, అంతరిక్ష పరిశోధనలో భారత్ సాధించిన విజయాలపై ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. ప్రధానోపాధ్యాయులు కృష్ణచైతన్య, ఇస్తారి, శుద్దోదన్, శ్రీధర్ పాల్గొన్నారు

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి



మహిళా సంఘాల సభ్యులతో సాయన్న

బోథ్: స్వయం సహాయక మహిళా సంఘాలు ప్రభుత్వం అందిస్తోన్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని డీఆర్డీవో సాయన్న అన్నారు. గురువారం మండల కేంద్రంలోని మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో మహిళా సంఘాలతో సమావేశం నిర్వహించారు. పలు ప్రభుత్వ పథకాలను వివరించారు. ఎంపీడీవో జీవన్ రెడ్డి, ఏటీఎం మాధవ, ఏపీవో జగ్దేరావు, సంస్థాగత నిర్మాణ ప్రాజెక్టు మేనేజర్ హేమలత, సీసీలు సంజీవ్, గంగాధర్, మహిళా సంఘాల సభ్యులు శకుంతల, మౌనిక, పోసాని, సుభద్ర, విజయలక్ష్మి, సేవంత బాయి తదితరులు ఉన్నారు.

'షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి'



ఇంద్రవెల్లి: ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

ఇంద్రవెల్లి: రాష్ట్ర ప్రభుత్వం నిర్ధారణ పేరుతో అర్హులైన రైతులకు రుణమాఫీ ఆపడం హేయమైన చర్య అని, ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని బీఆర్ఎస్ పార్టీ మండల కోఆర్డినేటర్ షేక్ సుఫీయన్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి ధర్నా నిర్వహించారు. మాజీ జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ అంజద్, మాజీ మండల కోఆప్షన్ సభ్యుడు మీర్జా జీలానిబేగ్, మాజీ ఎంపీటీసీ సభ్యులు మడావి భీంరావ్, కార్యకర్తలు ధరణి ధన్‌రాజ్, శ్రీనివాస్, రాంనివాస్ ఉన్నారు.

తలమడుగు: ప్రభుత్వం ప్రకటించిన రెండు లక్షల రుణమాఫీ పథకంలో పంటలు పండించే రైతులందరికీ రుణాలు మాఫీ చేయాలని తలమడుగు గ్రామ రైతులు డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు.

ఉట్నూర్‌రూరల్: రైతులను మోసం చేసిన ప్రభుత్వం ఎప్పటికి నిలువదని మాజీ ఎంపీపీ, బీఆర్ఎస్ ఇన్‌చార్జి అధ్యక్షుడు పంద్ర జైవంత్‌రావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌక్‌లో పార్టీ పిలుపులో భాగంగా రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. మాజీ సర్పంచ్ ఆశారెడ్డి, సలీం, పుర్కబాపురావు, ధరణి రాజేశ్, రమేశ్, అజయ్, ముజీబ్‌ఖాన్, రషీద్, భరత్, రాజు, బాబా, రైతులు తదితరులు పాల్గొన్నారు.

'ఆయుర్వేదం'తో దుష్ప్రభావాలు ఉండవు



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య బృందం

బేల: ఆయుర్వేద వైద్యంతో దుష్ప్రభావాలు ఉండవని, మందులు క్రమక్రమంగా పనిచేసి రోగాల నివారణ సాధ్యపడుతుందని ఆయుష్ జిల్లా ప్రోగ్రాం అధికారి ప్రీతల్ రాథోడ్ పేర్కొన్నారు. గురువారం మండలకేంద్రంలోని శ్రీరామ మందిరం కమ్యూనిటీ హాల్‌లో ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మధుమేహం, అర్షమొలలు, దగ్గు, దమ్ము, రక్తపోటు, స్త్రీ సంబంధిత, తదితర దీర్ఘకాలిక రోగులకు వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేశారు. కార్యక్రమంలో జైనథ్, బేల మండలాల ఆయుష్ వైద్యాధికారి అనిత, ఫార్మసిస్ట్ సుమన్, సిబ్బంది, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పీఈటీ ఉద్యోగం సాధించిన మమత



మునేశ్వర్ మమత

బజార్‌హత్నూర్: మండలంలోని దేగామ గ్రామానికి చెందిన మునేశ్వర్ మమత గిరిజన గురుకుల పాఠశాల పీఈటీ ఉద్యోగ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి పీఈటీ ఉద్యోగం సాధించింది. గురువారం ఇచ్చోడలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల (టీటీడబ్ల్యూఆర్ఈఐఎస్)లో విధుల్లో చేరారు.

మహిళా కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఎదులాపురం: ప్రభుత్వరంగ స్కీమ్‌లలో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, డైలీ వేజ్, టైం స్కేల్ విధానంలో పనిచేస్తున్న మహిళా కార్మికులు, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కిరణ్ డిమాండ్ చేశారు. సీఐటీయూ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గురువారం నిర్వహించిన వర్క్‌షాప్‌నకు జిల్లా ప్రతినిధిగా హాజరై మాట్లాడారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ అభివృద్ధి పనుల్లో భాగస్వామ్యం కావాలి

నార్నూర్: పంచాయతీ అభివృద్ధి పనుల్లో పెసా మొబలైజర్‌లు భాగస్వామ్యం కావాలని పెసా మొబలైజర్ జిల్లా కోఆర్డినేటర్ అర్క వసంత్‌రావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. హెల్త్‌సూపర్‌వైజర్ చరణ్‌దాస్, పెసా మొబలైజర్‌లు పాల్గొన్నారు.

గుట్కా పట్టివేత

సిరికొండ: అక్రమంగా విక్రయిస్తున్న నిషేధిత గుట్కాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై నవీన్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ముందస్తు సమాచారంతో మండల కేంద్రంలోని హప్పు పాన్‌షాప్‌లో తనిఖీలు నిర్వహించగా సుమారు రూ.14,000 విలువ గల నిషేధిత గుట్కా ప్యాకెట్లు లభ్యమయ్యాయని తెలిపారు. అక్రమంగా గుట్కా ప్యాకెట్లు విక్రయిస్తున్న సిరికొండ గ్రామానికి చెందిన హప్పు, ఆదిలాబాద్ వ్యాపారి అస్లాంలను విచారిస్తున్నట్లు తెలిపారు.

ఇంటింటా ఫీవర్ సర్వే నిర్వహించాలి

జైనథ్: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో వైద్య సిబ్బంది ఇంటింటా ఫీవర్ సర్వేను తప్పనిసరిగా నిర్వహించాలని డిస్ట్రిక్ట్ ఇమ్యూనైజేషన్ ఆఫీసర్ వైసీ శ్రీనివాస్ సూచించారు. గురువారం మండలంలోని డొల్లార గ్రామంలో గిమ్మ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని తనిఖీ చేశారు. సిబ్బందితో కలిసి గ్రామంలో తిరుగుతూ.. పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. మురికి నీళ్లు నిల్వ ఉన్న ప్రదేశాల్లో బ్లీచింగ్, దోమల మందు పిచికారీ చేయించారు. సీహెచ్‌వో ఈశ్వర్, హెచ్ఈవో రామిరెడ్డి, సూపర్‌వైజర్ అనిత, ఏఎన్ఎం సునంద, పాల్గొన్నారు.